క్లుప్తంగా

ఓబీసీ మహాసభ పోస్టర్స్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మల్లికార్జున్‌గౌడ్, నాయకులు

తూప్రాన్: అఖిల భారత జాతీయ ఓబీసీ 10వ మహాసభ వాల్ పోస్టర్‌ను బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిన్నలింగ్ మల్లికార్జున్ గౌడ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హలో బీసీ–చలో గోవా..ఆగస్టు 7న జరిగే అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నలంద విద్యా సంస్థల ఇన్‌చార్జి పట్లూరి రవీందర్, బాయకాడి ఆంజనేయులు, పర్వతాలు, బాలేష్, బీమరి బాలరాజ్, మనోహర్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



బూర్గుపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని బూర్గుపల్లితో పాటు పెద్దశంకరంపేటలోని నర్సరీలను ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ సోమవారం పరిశీలించారు. వనమహోత్సవంలో భాగంగా ఆయా గ్రామాలలో నాటే మొక్కలను పరిశీలించి, గుర్తించిన స్థలాల్లో మొక్కలు నాటాలని, ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేయాలని గ్రామకార్యదర్శులకు, ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. అనంతరం మొక్కలు నాటేందుకు గుంతలు తీసే పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ సంతోష్‌కుమార్, గ్రామకార్యదర్శులు పాషా, వెంకటరాములు, ఈసీ నవాజుద్దీన్, టీఏలు మోహన్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలతో అదనపు జ్ఞానం

ఎంఈఓ నీరజ



మాట్లాడుతున్న ఎంఈఓ నీరజ

చేగుంట(తూప్రాన్): పాఠశాలల్లోని గ్రంథాలయాలతో విద్యార్థులకు అదనపు జ్ఞానం కల్పించాలని ఎంఈఓ నీరజ అన్నారు. చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లోని గ్రంథాలయాల్లోని పుస్తకాలను విద్యార్థులతో చదివించి వారి జ్ఞానం పెంపొందించేలా చూడాలని పేర్కొన్నారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలియజేయాలని పేర్కొన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అమర్‌శేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, తిరుపతి, మల్లికార్జున్, నాగరాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

జీడిపల్లిలో రేషన్ కార్డుల అందజేత



జీడిపల్లిలో రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని జీడిపల్లిలో సోమవారం కాంగ్రెస్ నాయకులు కొత్త రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు రాగం శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా ఇవ్వని రేషన్ కార్డులు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్, నాయకులు యాదగిరి, చందూ తదితరులు పాల్గొన్నారు.

కొప్పోల్‌లో భక్తుల సందడి

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొప్పోల్ ఉమాసంగమేశ్వర దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలోని కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అధ్వానపు రోడ్లతో అగచాట్లు

- వాహనదారుల నానా అవస్థలు
- తూతూమంత్రంగా మరమ్మతులు
- పదేళ్లయినా మారని తీరు



అల్లాదుర్గం గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి

అల్లాదుర్గం(మెదక్): అధ్వానపు రోడ్లతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అడుగడుగునా గుంతలతో వాహనదారులు పడుతున్న బాధలు వర్ణానాతీతం. నిత్యం ప్రయాణం నరకప్రాయంగా మారింది. నిధులు మంజూరవుతున్నా నామమాత్రంగా పనులు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. అల్లాదుర్గం ఐబీ చౌరస్తా నుంచి వట్‌పల్లి మీదుగా జహీరాబాద్ రోడ్డు పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఈ రహదారి నుంచే కర్నాటక రాష్ట్రం బీదర్‌కు వెళుతుంటారు. పదేళ్లుగా రోడ్డు దుస్థితి ఇలాగే ఉంది. ఈ ప్రాంత ప్రజలు, ఆటో డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారు. ఈ రోడ్డుపై వాహనాలు నడపాలంటేనే జంకుతున్నారు. బహిరన్‌దిబ్బ గ్రామం నుంచి వట్‌పల్లి గ్రామానికి 8 కిలో మీటర్ల ప్రయాణం ఆరగంటకు పైనే పడుతుందంటే రోడ్డు ఎంత అధ్వానంగా ఉందో తెలుస్తుంది. అల్లాదుర్గం నుంచి వట్‌పల్లి, రాయిపల్లి మీదుగా జహీరాబాద్‌కు వెళ్లాలంటే 60 కిలో మీటర్లు దూరం ఉంది. జహీరాబాద్ వెళ్లేందుకు రెండు గంటల సమయం పడుతుందని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం చేయలేక చాలమంది, జహీరాబాద్ వెళ్లేందులకు జోగిపేట, సంగారెడ్డి మీదుగా వాహనాలలో వెళుతున్నారు. రోడ్డుపై ప్రయాణం చేయడంతో వాహనాలు దెబ్బతినడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన అల్లాదుర్గం నుంచి చౌరస్తాకు వెళ్లే రోడ్డు సైతం దారుణంగా మారింది. ఈ రోడ్డు మరమ్మతు విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికలలో అధికార పార్టీ నాయకులు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి అధ్వాన్న రోడ్లను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పీఎస్ బీ విధానంతో లాభాలు

- వరి సాగులో రైతులకు అవగాహన
- కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ప్రతాప్‌రెడ్డి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త, విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: వరి పంట సాగులో పీఎస్ బీ వాడకంపై అవగాహన అవసరమని తుంకి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ ప్రతాప్‌రెడ్డి రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని అహ్మద్‌నగర్‌లో తుంకి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ ప్రతాపరెడ్డి, మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీ బీఎస్సీ ఫైనల్ ఇయర్ (రావే) విద్యార్థుతో కలిసి రైతులకు ఫాస్పరస్ సాల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా (పీఎస్ బీ) ఉపయోగించే విధానంతో పాటు లాభాలను రైతులకు వివరించారు. రైతులు అధికంగా భాస్వరపు ఎరువులు వాడటం వల్ల భూమిలో నిల్వలు పెరుగుతాయని, సూక్ష్మ పోషకాల లోపాలు కూడా వస్తాయని రైతులకు వివరించారు. 25 శాతం భాస్వరపు ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో రావే విద్యార్థులు అభినయ, అద్విత, ఎస్.దేవిక, ఎస్.దేవిక, బ్లెస్సి, ఐశ్వర్య, దీక్షిత, అనూష పాల్గొన్నారు.

మూసాపేటలో..

క్రిమిసంహారక మందుల వాడకంపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఉదయ్ ఆధ్వర్యంలో మరో బృందం రావే విద్యార్థులు మండలంలోని మూసాపేట రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. పంటలపై మందులు పిచికారి చేసే సమయంలో చేతి గ్లౌజ్‌లు, మాస్కులు ధరించాలని సూచించారు. ప్రశాంతమైన పొడి రోజుల్లో నీటిని ఆనకట్టి మందులు పిచికారీ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు శ్రీ రక్ష, జ్ఞానేశ్వరి, సుదీసిన, కావేరి, గౌతమి, లక్ష్మి, వతిక, హర్షిత, స్వాతి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు.. ఒకరోజు జైలు

నర్సాపూర్: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి స్థానిక జూనియర్ సివిల్ జడ్జి హేమలత సోమవారం ఒక రోజు జైలు శిక్ష విధించారు. పది రోజుల క్రితం ఎస్ఐ లింగం ఆధ్వర్యంలో పోలీసులు నర్సాపూర్ మెదక్ జాతీయ రహదారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. సూరారం గ్రామానికి రహీం మద్యం తాగి వాహనం నడిపినట్లు రుజువు అయింది. కాగా సోమవారం అతను స్థానిక కోర్టుకు హాజరు కావడంతో జడ్జి హేమలత కేసును విచారించి అతనికి ఒక రోజు జైలు శిక్ష విధించారు. పోలీసులు అతడిని సంగారెడ్డి జైలుకు తరలించారు.

విద్యార్థులలో పఠనాసక్తి పెంపొందించాలి

మనోహరబాద్(తూప్రాన్): విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు కృషి చేయాలని పరిశీలకురాలు క్రాంతి కుమారి అన్నారు. కాళ్లకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం కాంప్లెక్స్ సమావేశం నిర్వహించగా కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పరిశీలకురాలు క్రాంతికుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాశక్తి పెంపొందించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయలకు సూచించారు. పఠనాశక్తి పెంపొందిచడానికి పాఠశాల గ్రంథాలయాలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ మల్లేశం, ప్రధానోపాధ్యాయులు నర్సింగం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కోసం రాస్తారోకో



కొడిపల్లిలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

కౌడిపల్లి(నర్సాపూర్): ఆర్టీసీ బస్సు నడపాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు రాస్తారోకో చేశారు. వెల్మకన్న మాజీ సర్పంచ్ రాజేందర్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రమైన కౌడిపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్, విద్యార్థులు మాట్లాడుతూ.. గతంలో కౌడిపల్లి నుంచి అందుగులపల్లి వరకు ఉదయం సాయంత్రం బస్సుసౌకర్యం ఉండేదని చెప్పారు. ఏడాదిగా అధికారులు బస్సును నడపడం లేదన్నారు. కౌడిపల్లి కళాశాలకు వెల్మకన్న, వసురాం తండా, కొట్టాల, లింగంపల్లి, బిట్లతండా, అందుగులపల్లితోఆటు పలు తండాలలోని సుమారు 150మంది విద్యార్థులు కళాశాలకు వస్తున్నారని చెప్పారు. బస్సు లేకపోవడంతో విద్యార్థులు ఉదయం, సాయంత్రం ఆటోలో కళాశాలకు వచ్చేందుకు డబ్బులతోపాటు ఆటో నిండే వరకు పడిగాపులు కాస్తూ సమయం వృథా అవుతుందన్నారు. రోడ్డుపై విద్యార్థుల రాస్తారోకో చేయడంతో పలు వాహనాలు ఆగిపోయాయి. దీంతో స్పందించిన ఎస్ఐ రంజిత్‌రెడ్డి ఆర్టీసీ డీఎంతో మాట్లాడారు. మూడు రోజులలో బస్సు నడుపుతామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

ఘనంగా రామలింగేశ్వర స్వామి అభిషేకం



మంజీరాలో స్వామి వారిని అభిషేకించిన భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): శ్రావణ మాసం మొదటి సోమవారం కావడంతో మండల పరిధిలోని చండూర్‌లోని పురాతన దేవాలయంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి మంజీరా నదిలో ఘనంగా జలాభిషేకం, అనంతరం గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. రామలింగేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని చండూర్ గ్రామ శివారులో గల మంజీరా నది తీరంలో వెలసిన గంగా భవానీ అమ్మవారి ఆలయ సమీపంలో స్వామి వారికి జలాభిషేకం చేసి, అక్కడే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ఎంఈఓ బాలరాజు



మాట్లాడుతున్న ఎంఈఓ బాలరాజు

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ బాలరాజు తెలిపారు. సోమవారం కౌడిపల్లిలో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వహించి విద్యార్థులకు విద్యాబోధన చేయాలన్నారు. అనంతరం రిసోర్స్‌పర్సన్‌లు రమేష్, మహేష్, మహిపాల్, నవాజుద్దీన్, మల్లేశం, తేజశ్రీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ (ఫండమెంటనల్ లిట్రసీ అండ్ న్యూమరసి), బేస్‌లైన్ టెస్ట్, గ్రంథాలయంపై శిక్షణ ఇచ్చారు.

ఎంపీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎంపీ రఘునందన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): చేగుంట–మెదక్ రోడ్డుపై ఉన్న రైల్వేగేట్ వద్ద ఆర్వోబీ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు చిత్రపటానికి చిన్నశంకరంపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు రాజు ఇధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేష్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, ఆకుల రాజు, మంజుల, శ్రీనివాస్, శివశంకర్, వెంకన్న, ఉపేందర్, రమేష్, నర్సింహులు, ఎల్లం, చంద్రమౌళి, రాంప్రసాద్, సతీష్, పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఐదు ఫిర్యాదులు

నారాయణఖేడ్: ఖేడ్‌లో సబ్ కలెక్టర్ ఉమా హారతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించాక మొదటి ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రేషన్‌కార్డులతో పాటు ఆయా సమస్యలపై ఐదు ఫిర్యాదులు అందాయి. అధికారులు తక్షణం స్పందించి చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ అధికారులకు సూచించారు. త్వరలో అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు.

అజోల్లా.. బహుళ ప్రయోజనకారి

ఏడీఏ రాజ్‌నారాయణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రాజ్‌నారాయణ

రామాయంపేట(మెదక్): అజోల్లా అనే సేంద్రియ ఎరువు పంటలకు ఎంతో ఉపయోగపడుతుందని వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) రాజ్ నారాయణ పేర్కొన్నారు. సోమవారం అజోల్లా వినియోగం విషయమై కార్యాలయం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పొలాల్లో సహజసిద్ధంగా పెరుగుతుందని, ఈ ఎరువుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఎరువు గాలిలోని నత్రజనిని నిక్షిప్తం చేసుకొని నేలకు అందిస్తుందని, దీనితో రైతులకు నత్రజని ఎరువుల వాడకం తగ్గుతుందని చెప్పారు. దీంతోపాటు నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని, కలుపు మొక్కలు పెరుగకుండా చూస్తుందని వివరించారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని రాజ్‌నారాయణ సూచించారు. అజోల్లా ఎరువు పంటకు వినియోగంతోపాటు పాడి రైతులకు దానాగా ఉపయోగపడుతుందని ఏడీఏ పేర్కొన్నారు.

సేంద్రియంపై దృష్టి సారించండి



శీలాంపల్లిలో మునగతోట వద్ద అగ్రికల్చర్ విద్యార్థులు



తునికిలో పొలంలో పీఎస్‌బీ వాడకాన్ని చూపుతున్న విద్యార్థులు

మల్లారెడ్డి వర్శిటీ అగ్రికల్చర్ విద్యార్థులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు తమకున్న నేలలో కొంత వరకైనా సేంద్రియ వ్యవసాయం చేయాలని మల్లారెడ్డి యూనివర్శిటీ అగ్రికల్చర్ విద్యార్థులు అన్నారు. సోమవారం వారు కేవీకే శాస్త్రవేత్త డాక్టర్, రవికుమార్ ఆధ్వర్యలో మండల పరిధిలోని శీలాంపల్లిలో గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా రైతు సంజీవరెడ్డి ఎకరా పొలంలో వరి, మరో ఎకరాలో మునగను సేంద్రియ పద్ధతిలో చేస్తున్న సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం చేయడం మూలంగా నేల సారవంతమవడంతో పాటు, కాలుష్యాన్ని చాలా వరకు నివారించవచ్చని చెప్పారు. ప్రతి రైతు కనీసం తనకున్న నేలలో తన కుటుంబ సభ్యులు తినడానికైన సేంద్రియ వ్యవసాయం చేయాలన్నారు. కాగా, రైతు సంజీవరెడ్డి ఎకరా వరికి 20 కిలోల విత్తనాలు వాడాడని, 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. అదేవిధంగా మునగ సాగులో ఎకరాకు 580 మొక్కలు నాటగా, 3 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అక్షయ, చందన, అశ్విని కుమారి, భావన, లతాశ్రీ, శశ్విక, భవాని, దేవిక పాల్గొన్నారు.

పంటలకు మేలు

కౌడిపల్లి(నర్సాపూర్): వరి నారు వేసేటప్పుడు నారును పీఎస్‌బీ ద్రావణంలో ముంచి నాటు వేసుకోవడం వల్ల పంటకు, రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు సూచించారు. మండలంలోని తునికి వద్ద గల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)కు మల్లారెడ్డి వ్యవసాయ కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ ఫైనలియర్ విద్యార్థులు రావే (రూరల్ అగ్రికల్చర్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాం)లో భాగంగా వచ్చారు. దీంతో సోమవారం కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ ఆధ్వర్యంలో తునికి గ్రామంలో రైతు వెంకటస్వామి పొలంలో విద్యార్థులు వైష్ణవి, ఝాన్సీ, హరిప్రియ, గాయని రైతులకు అవగాహన కల్పించారు.

విద్యతోనే వికాసం

కళాబృందం 'మేల్కొలుపు'



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని బండపోసాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం మేల్కొలుపు కళాబృందంచే విద్యార్థులకు చదువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరికీ విద్యార్థి దశ చాలా కీలకమని, ఈ సమయంలో చెడుదారిన పట్టకుండా సన్మార్గంలో నడవాలని సూచించారు. బాలబాలికలు చదువుపై దృష్టిసారించి క్రమశిక్షణతో విద్య నభ్యసించడం వలన ఉత్తమ భవిష్యత్ లభిస్తుందన్నారు. పిల్లలను ఉత్తమ మార్గం వైపు నడిపించేందుకు తల్లిదండ్రులు సమయం కేటాయించడం, శ్రద్ధ తీసుకోవడం అవసరమన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం మూఢనమ్మకాలు వంటి వాటిని నమ్మవద్దని మ్యాజిక్ షో ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాబృందం ఇన్‌చార్జి సురేందర్, ఇన్‌చార్జి ఎస్ఐ రాంచందర్, వెల్దుర్తి ఎస్ఐ రాజు, హెచ్ఎం సిద్దిరామగౌడ్ పాల్గొన్నారు.

ఆ పరిశ్రమను జప్తు చేయాలి

యూత్ కాంగ్రెస్ నేతల డిమాండ్

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో పన్నులను ఎగవేసిన జీఎస్ఎన్ ఫెరొలైజ్ పరిశ్రమను ప్రభుత్వం జప్తు చేసుకొని బాధితులకు న్యాయం చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులు ఓసామొద్దీన్, బోయిని శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం వారు పరిశ్రమను సందర్శించారు. 2016లో జీఎస్ఎన్ పరిశ్రమ మూతపడిందని, అప్పటికే యాజమాన్యం విద్యుత్ బిల్లులు 176 కోట్లు, గ్రామ పంచాయతీకి పన్ను రూపేణ రూ.30 లక్షలు, మెటీరియల్ సరఫరా చేసిన కాంట్రాక్టర్లకు, స్థానికంగా పనిచేసిన కొందరు కార్మికులకు వేతనాలు బకాయి పడ్డారని తెలిపారు. ఇటీవల కార్బన్ రిసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తక్కువ రేటుకే ప్లాంటు కొనుగోలు చేసిందని తెలిపారు. ఈ సంస్థ విద్యుత్ బకాయిలతో పాటు కాంట్రాక్టర్లు, కార్మికులకు డబ్బులు చెల్లిస్తానని చెప్పి మోసం చేసిందని, పరిశ్రమ పరికరాలను తీసుకెళ్తున్నట్లు తెలిపారు. బాధితులకు న్యాయం జరగనందున ప్రభుత్వమే పరిశ్రమను జప్తు చేసుకొని న్యాయం చేయాలని కోరారు.

బీమా.. ప్రజలకు ధీమా

టీజీబీ మేనేజర్ రాజేశ్ కుమార్

రేగోడ్(మెదక్): ప్రధానమంత్రి బీమా యోజన పాలసీ చేయిస్తే.. ప్రజలు ధీమాగా ఉండవచ్చని టీజీబీ మేనేజర్ రాజేశ్ కుమార్ అన్నారు. సోమవారం రేగోడ్ గ్రామానికి చెందిన వాణి, సాయిలు, చంద్రప్ప, మర్పల్లికి చెందిన విఠల్, దోసపల్లికి చెందిన సమ్మయ్య, చౌదర్‌పల్లికి చెందిన దుర్గయ్యలు టీజీబీ బ్యాంకులో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకానికి రూ.436 చెల్లించి బీమా చేయించుకున్నారు. వీరంతా వేర్వేరు కారణాలతో ఇటీవల మృతిచెందారు. వీరికి బీమా కింద ఒక్కొక్కరికీ రూ.2 లక్షలను చెక్కులు నామినికి అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. బ్యాంకు అందించే ఇన్సూరెన్స్ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్‌లు రాజ్ కుమార్, భూమయ్య, క్యాషియర్‌లు రాకేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల మంజూరుపై హర్షం

నర్సాపూర్: మండలంలోని నాగులపల్లిలో ఎస్సీ, ఎస్టీ గురుకుల కళాశాల మంజూరు చేయడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, ఎంపీ రఘునందన్‌రావు చిత్రపటాలకు బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ మాట్లాడుతూ నర్సాపూర్ మండలం నాగులపల్లిలో ఎస్సీ, ఎస్టీ గురుకుల కళాశాల ఏర్పాటు చేసేందుకు కేంద్రం నుంచి ఎంపీ కృషి ఫలితంగా ప్రధానమంత్రి మూడున్నర కోట్ల రూపాయలు మంజూరు చేశారని వారు వివరించారు. నిధుల పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకుగాను ప్రదాని, ఎంపీల చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్, పార్టీ నాయకులు బుచ్చేష్‌యాదవ్, రాజేందర్, పెద్ద రమేష్‌గౌడ్, సురేష్, రమేష్‌యాదవ్, యాదగిరి, రమణరావు, ఆంజనేయులుగౌడ్, నగేష్, చంద్రయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ పంచాయతీ కార్మికులకు రెయిన్‌కోట్స్



చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిటుకుల్ గ్రామ పంచాయతీ కార్మికులకు సోమవారం రెయిన్‌కోట్స్ అందజేశామని పంచాయతీ కార్యదర్శి తిరుపతి అన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైందని, తరచూ వర్షాలలో తడిచే కార్మికులు అనారోగ్యాలకు గురయ్యే అవకాశాలు ఉండడంతో, వారికి రెయిన్‌కోట్స్ అందజేశామన్నారు. కార్మికులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ భగవాన్‌రెడ్డి ఉన్నారు.

◆ ఆత్మానంద ఆశ్రమంలో శత రుద్రాభిషేకం

నర్సాపూర్ రూరల్: మండలంలోని రుస్తుంపేట ఆత్మనంద ఆశ్రమంలోని శివాలయంలో పీఠాధిపతి శ్రీ రాజయోగి వెంకటస్వామి ఆధ్వర్యంలో సోమవారం లోక కల్యాణార్థం శత రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో పాటు భక్తులకు ప్రవచనాలు చేసిన అనంతరం శత రుద్రాభిషేకం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పూజారి ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

◆ కల్లు దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కల్లు దుకాణాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఎస్సై రాజు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కల్లు విక్రయదారులతో సమావేశం ఏర్పాటుచేశారు. తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ చట్టం–2014 మేరకు వీలైనంత త్వరగా దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని దుకాణ దారులకు నోటీసులు అందజేశారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని శభాష్‌పల్లికి చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సింలు, యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

◆ ఎస్సీల రిజర్వేషన్లు పెంచాలి

నర్సాపూర్: ఎస్సీ 57 ఉపకులాల రిజర్వేషన్లను 15 శాతం నుంచి 18 శాతానికి పెంచాలని హోళియ దాసరి హక్కుల పోరాట సమితి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన ఉండే విధంగా పాఠ్యాంశాలుగా చేర్చాలని కోరారు. నర్సాపూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

◆ నాగులమ్మ ఆలయంలో నాగులచవితి

రామాయంపేట(మెదక్): స్థానిక పాండచెరువు కట్టపై కొలువైన శ్రీనాగులమ్మ సహిత ద్వాదశ జ్యోతిర్లింగ దేవాలయంలో సోమవారం నాగుల చవితి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రహోమం, కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రుద్రాభిషేకం, గణపతి హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు రవితేజశర్మ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని సూచించారు.